# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 25-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో 'అంబేద్కర్ కళావేదిక'ను ఈరోజు ప్రారంభిస్తారు.**

**2.** **ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పర్చువల్‌గా ఈరోజు శంకుస్థాపన చేస్తారు.**

**3.** **దేశంలోనే లెవెల్ --1 క్యాన్సర్ ఆసుపత్రిగా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

**4.** **వచ్చే ఏడాది జరగనున్న గోదావరి నది పుష్కరాల సందర్భంగా పరీవాహక ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈరోజు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు.**

=========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో ఈరోజు పర్యటించనున్నారు. నగరంలోని స్వరాజ్య మైదానంలో నిర్మించిన 'అంబేద్కర్ కళావేదిక'ను ముఖ్యమంత్రి ఈరోజు ప్రారంభించనున్నారు. 85 కోట్ల రూపాయలతో అత్యాధునిక వసతులతో దీనిని నిర్మించారు. అక్కడే నిర్వహించనున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సదస్సు - 2026ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న 38 ఎంఎస్ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఎంఎస్ఎంఈ రంగ అభివృద్ధి, పారిశ్రామిక పెట్టుబడులు, ఉపాధి అవకాశాల విస్తరణ, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటి అంశాలపై సదస్సులో చర్చించనున్నారు.

--------------------------

గోదావరి నది పుష్కరాల సందర్భంగా పరీవాహక ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ ఈ రోజు క్షేత్రస్థాయిలో  పర్యటించనున్నారు. ఉదయం పుష్కరాల రేవు నుంచి కోటిలింగాల ఘాట్ వరకు బోటులో ప్రయాణిస్తూ గోదావరి తీర ప్రాంతాలను, వివిధ ఘాట్లను పరిశీలించనున్నట్లు అధికారుల వెల్లడించారు. ఈ సందర్భంగా జల కాలుష్యానికి కారణమవుతున్న గోదావరి నదీ ప్రాంతాలు, నల్లా కాలువ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పుష్కరాల ఏర్పాట్ల పురోగతి,  గోదావరి నది

కాలుష్య నియంత్రణ చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో చర్చిస్తారన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా, చింతపల్లిపాడు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చింతపల్లిపాడు గ్రామంలో 70 మందికి పైగా క్యాన్సర్ బాధితులు ఉన్న అంశంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దేశంలోనే లెవెల్-1 క్యాన్సర్ ఆసుపత్రిగా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు నుంచి మహిళా వారోత్సవాలు నిర్వహించనున్నారు. మహిళా సంఘ భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వర్చువల్ గా శంకుస్థాపన చేస్తారు. ఈ నెల 31 వరకు నిర్వహించే వారోత్సవాలకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. వారం రోజులపాటు.. నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్రామ, మండల స్థాయిలో ఇందిరా మహిళాశక్తి భవనాలు, అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపనలు, మహిళల భద్రత, చట్టాలపై అవగాహన కల్పించడం, సోలార్ పవర్ ప్లాంట్ల స్థాపన, 'అమ్మ మాట - అంగన్వాడీ బాట' తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

---------------------------

రైతులను ఆదుకునేందుకు మార్క్ ఫెడ్ ద్వారా 2 లక్షల 4 వేల టన్నుల మొక్కజొన్న పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు. రాష్ట్రంలో రైతులు, పౌల్ట్రీ, ఉద్యాన, ఆక్వా రంగాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ అంశాలపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో మంత్రి దృశ్యమాధ్యమ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేకుండా సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కొబ్బరి రైతులకు మార్కెటింగ్ అవకాశాలు పెంచాలని, ఆక్వా రంగ సమస్యలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ ఉష్ణోగ్రతల ప్రభావంతో పౌల్ట్రీ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. రానున్న మూడు రోజులు పాటు ఇదే తీవ్రత కొనసాగే అవకాశం ఉందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రోజు 29 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 166 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు,

బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 నుంచి 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.

మరోవైపు తెలంగాణలో ఈ రోజు పలు జిల్లాల్లో వడగాల్పులతో పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశముందని తెలిపింది.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలోనే నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో 5 లక్షల రూపాయల చొప్పున జమ చేస్తున్నట్లు తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఒక కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని 53 లక్షల నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పేర్కొంటూ..

వాయిస్..30 సెకన్లు

---------------------------

జనగణనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న తొలి దశ ఇళ్ళ గణన ప్రక్రియను డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ సెన్సస్ వి.ఎల్.ఎన్. మూర్తి పరిశీలించారు. నగరంలోని మధురవాడ జోన్‌లో నిన్న పర్యటించారు. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న ఇళ్ల గణనను పరిశీలించి, మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో జనగణన కార్యక్రమం నాణ్యతతో, వేగవంతంగా నిర్వహిస్తున్నందుకు అధికారులను అభినందించారు. జనగణనలో ఏ ఒక్క ఇంటిని మినహాయించకుండా నమోదు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పనలో జనగణన కీలకమని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 134 వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

ఐపిఎల్ 2026 చివరి లీగ్ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ జట్టు 30 పరుగుల తేడాతో ముంబయి ఇండియన్స్ పై గెలిచి టాప్-4లో చోటు దక్కించుకుంది. ముంబయి వాంఖడే స్టేడియంలో నిన్న జరిగిన ఈ మ్యాచ్ లో మొదట రాజస్థాన్ రాయల్స్ 8 వికెట్లకు 205 పరుగులు చేసింది. ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో

9 వికెట్లకు 175 పరుగులే చేసింది.

అదేవిధంగా కోల్ కతాలో నిన్న జరిగిన ఈ సీజన్ ఆఖరి లీగ్ మ్యాచ్ లో కొల్ కతా నైట్రైడర్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 5 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో కోల్ కతా నైట్రైడర్స్ 18.4 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌటైంది.

---------------------------

ప్రపంచ థైరాయిడ్ నివారణ దినం ఈరోజు నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధి సంబంధిత సమస్యలపై అవగాహన లేని కారణంగా అనేకమంది ఆరోగ్యసమస్యలకు గురౌతూఉంటారు. థైరాయిడ్ సమస్యలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు ప్రతిసంవత్సరం మే 25వ తేదీ ప్రపంచ థైరాయిడ్ నివారణా దినంగా పాటిస్తున్నారు. థైరాయిడ్ గ్రంధి నిర్ణీతమోతాదుకంటే తక్కువగా హార్మోన్ విడుదలచేస్తే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. దీన్నే హైపోథైరాయిడిజమ్‌గా వ్యవహరిస్తారు.

---------------------------

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల సాంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే హస్త కళలకు విస్తృత ప్రాచుర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత పేర్కొన్నారు. హస్త కళలకు మార్కెట్ విస్తరించడంతో కళాకారులకు ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దిశగా 'తరంగా' అనే ఏఐ ఆధారిత రియల్ టైమ్ పర్యవేక్షణ వ్యవస్థతో పాటు, 'కళాక్షి' పేరుతో వాట్సాప్ వ్యవస్థను రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే వెబ్‌సైట్ అందుబాటులో ఉందని తెలిపారు. వినియోగదారులు కోరిన హస్త కళా ఉత్పత్తులను నేరుగా వారి ఇళ్లకే చేరవేసే ఉద్దేశంతో ఎఐ టూల్స్ ను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు.

=====================